క్లుప్తంగా

మహిళలతోనే ఆర్థిక ప్రగతి


మాట్లాడుతున్న రాస్ పొదుపు సంఘాల పీడీ నాగరాజు

ఏర్పేడు : మహిళలతోనే కుటుంబ ఆర్థిక ప్రగతి పురోభివృద్ధి దిశగా పయనిస్తుందని రాస్ పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని పాపానాయుడుపేటలోని రాస్ కార్యాలయంలో మంగళవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలంలో కొన్ని దశాబ్దాలుగా రాస్ ద్వారా మహిళలు, రైతులకు ఆర్థిక స్వావలంబనకు కృషి జరుగుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి మార్గాలను ఎంచుకుని తీసుకున్న రుణాలతో కుటుంబ పురోభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాస్ అధికారులు బాలాజీ రెడ్డి, రవి, మునీంద్ర, పార్థసారధి, సురేష్, రాస్ సిబ్బంది, లీడర్లు పాల్గొన్నారు.

గుడిమల్లం బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరు చేయండి


కలెక్టర్‌ను కలిసిన ఈవో, మాజీ చైర్మన్

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లంలో వెలసిన శ్రీ పరశురామస్వామి దేవస్థానానికి నూతనంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డునకు సిమెంటు రోడ్డు నిర్మించాలని ఆలయ ఈవో రామచంద్రా రెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి ఆలయ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి నూతనంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డునకు సిమెంట్ రోడ్డుతో పాటు నూతన అన్నదానం షెడ్డు (తాత్కాలిక షెడ్డు) నిర్మాణం కోసం విన్నవించారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

యూరియా కార్డుల పంపిణీ


రైతులకు పర్మిట్ స్లిప్పులు అందిస్తున్న అధికారులు

ఏర్పేడు : మండలంలోని ముసలిపేడు, సరస్వతికండ్రిగ, కందాడ గ్రామాలకు చెందిన రైతులకు మంగళవారం యూరియా కోసం కార్డులను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి సాగరిక మాట్లాడుతూ.. మండలంలో యూరియా సమృద్ధిగా ఉందని, కావాల్సిన రైతులు ఆయా సచివాలయాల్లో ఆధార్ కార్డును తీసుకెళ్లి పర్మిట్లు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, అంకయ్య, కేసినేని సుబ్రమణ్యం, మునెయ్య పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు


ఆలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్, సెక్రటరీ బాలచంద్రయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాఘవులు, సెక్రటరీ రమేష్, తిరుపతి జిల్లా అడహక్ చైర్మన్ సురేష్ బాబు, ట్రెజరర్ లలిత్ కుమార్, సంఘం వైస్ చైర్మన్ భాస్కర్ , సంఘం సభ్యులు చంద్రకాంత్, గణేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

స్కిమ్స్‌లో 97 శాతం ఉత్తీర్ణత


జయలక్ష్మి


చందన


ఇందుమతి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలోని శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(స్కిమ్స్) కళాశాల మంగళవారం విడుదలైన ఎంబీఏ 2023–25 బ్యాచ్ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇందులో పెర్నేటి జయలక్ష్మి 8.10 ప్రథమ స్థానం, కవనూరు చందన 8.08తో ద్వితీయ స్థానం, నైనారు ఇందుమతి 7.98లో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ.. తమ విద్యార్థులు ప్రతిభ చూపి 97 శాతం ఉతీర్ణత సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు కారణమైన అధ్యాపకులకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రజల నివేదన

ఈ చిత్రంలో కనిపిస్తున్న మంచినీటి బావి సత్యవేడు మండలం పెద్ద ఈటిపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టకండ్రిగ గిరిజన కాలనీ. ఈ బావిలో చెట్లపొదలు మొలకెత్తి అందులోని చెత్త, ఇతర ఆకులు , అలములు పడి ఉన్నాయి. ఆ నీటిని ఆ గిరిజన కాలనీకి చెందిన స్థానికులు వినియోగిస్తున్నారు.


సత్యవేడు : మిట్టకండ్రిగ గిరిజన కాలనీలో తాగునీటి బావి

సత్యవేడు : రాళ్లకుప్పంలో వర్షపునీటి నడుమ తాగునీటి కొళాయి



వరదయ్యపాళెం : చెట్ల పొదల మధ్యలో ఓవర్ హెడ్ ట్యాంక్



పల్లెల్లో రక్షితనీరు కలుషితం అవుతోంది. పైపులైన్ లీకేజీలతో కలుషిత నీరే సామాన్య జనానికి దిక్కుగా మారింది. క్షేత్రస్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీశాఖ అధికారుల సమన్వయం లోపించడంతో ప్రజలకు శుద్ధ జలం సరఫరా కలగానే మారింది. గ్రామ స్థాయిలో జరిపే నీటి పరీక్ష కిట్లు కనుమరుగ య్యాయి. కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

- రక్షిత నీరు ప్రశ్నార్థకం
- నీటి పథకాలపై నిర్లక్ష్యం
- సామాన్య ప్రజల దాహార్తికి.. కలుషిత నీరే దిక్కు
- మూలకు చేరిన నీటి పరీక్ష కిట్లు
- అనారోగ్యం బారిన పడుతున్న జనం

వరదయ్యపాళెం : గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. జల జీవన్ మిషన్ పథకం కింద గ్రామ సచివాలయాలకు కిట్లు అందజేసింది. వీటిని చాలా చోట్ల వాడకుండానే పక్కన పెట్టేశారు. రసాయనాలు, ఔషధాలు కాలం చెల్లడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా నీటి పరీక్షలు లేక కలుషిత నీటిని తాగుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో 90 గ్రామ సచివాలయాలకు ఒక్కొక్కటి రూ.1292 విలువ చేసే మలింట నోకా మీటరు, వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్ కిట్లు అందజేశారు. వీటిని ఎలా వినియోగించాలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కిట్లు సరఫరా చేసిన అనంతరం వాడకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో చాలాచోట్ల వినియోగించలేదు.

గ్రామీణులు తాగే నీటిలో ఉదజని సూచిక (పీహెచ్) క్షారం, ఇనుము, రెసిడ్యూల్, ఫ్రీ క్లోరిన్ ఎంత శాతం ఉందో గుర్తించేందుకు సాంకేతిక సహాయకులు పరీక్షలు చేయడం లేదు. నీటిలో లవణాల లభ్యత, మడ్డి, సల్ఫర్, కాల్షియం ఏ మేరకు ఉందో పరీక్షించి లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదు. ఫలితంగా ప్రజలు కలుషిత జలాలను తాగాల్సిన దుస్థితి నెలకొంది. ఉప్పు, ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నారు. నాణ్యతలేని నీరు తాగడంతో ఎంతో మంది టైఫాయిడ్, విరేచనాలు, కామెర్లు, విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసిన పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. మరోవైపు పైపులైన్ లీకేజీలతో నీటి వనరులు, బోరుబావులు చుట్టూ మురుగు చేరుతోంది. దీంతో ఆ నీటిని తాగడం వలన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నీటి పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

సత్యవేడు నియోజకవర్గ పరిధిలో రక్షిత మంచినీటి పథకాల వివరాలు

మండలం	రక్షిత నీటి పథకాలు
సత్యవేడు	284
వరదయ్యపాళెం	415
నాగలాపురం	293
పిచ్చాటూరు	341
బీఎన్‌కండ్రిగ	326
కేవీబీపురం	391

ట్యాంకుల శుభ్రత అంతంతే..!

పంచాయతీ కొళాయిలకు నీటి సరఫరా జరిగే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రత అంతంత మాత్రమే. ఎక్కువ చోట్ల ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో నెలల తరబడి అదే నీటిని వాడాల్సిన దుస్థితి. ట్యాంకు లోపల పేరుకుపోయిన పాచి, క్రిముల నీటిని ప్రజలు వాడుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. వీటి పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. పలుచోట్ల ట్యాంకులు పైకెక్కి శుభ్రం చేసేందుకు వీలుగా మెట్లు, నిచ్చెనలు కూడా లేకపోవడంతో ఆ ట్యాంకులు పైకి వెళ్లలేని పరిస్థితి. దీంతో ఆ ట్యాంకులు శుభ్రత గాలికి వదిలేస్తున్నారు.

అమలు కాని క్లోరినేషన్ ప్రక్రియ

గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ ద్వారా పంచాయతీ కొళాయిలకు నీటి సరఫరా చేసే పైపులైన్‌కు ఇన్‌లైన్ క్లోరినేషన్ అమర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా అమలు కాలేదు. ఈ ఇన్‌లైన్ క్లోరినేషన్ ద్వారా డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా చేసే జలాలను శుద్ధి చేస్తుంది. ఈ ప్రక్రియ తక్కువ ఖర్చుతో కూడుకుంది. ఇన్‌లైన్ క్లోరినేషన్ అనేది పైపులలో నీరు ప్రవహించేటప్పుడు ఆటోమేటిక్‌గా క్లోరిన్ జోడించడం ద్వారా నీటిని శుద్ధి చేస్తుంది. ఆచరణాత్మకమైన నీటి చికిత్స పద్ధతి, ఇది విద్యుత్ లేదా రోజు వారి వినియోగదారుల ఇన్‌పుట్ అవసరం లేకుండా తాగు నీటిని సురక్షితం చేస్తుంది. క్లోరిన్ మాత్రల ద్వారా నిరంతరం క్లోరిన్ విడుదలయ్యేలా చేసే పరికరాలను ఉపయోగించడం ద్వారా ఈ పద్ధతి నీటిలోని హానికరమైన బ్యాక్టీరియాను తొలగిస్తుంది. తద్వారా నీటిని సురక్షితంగా తాగడానికి వీలు కల్పిస్తుంది. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ప్రక్రియను ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది.

పడకేసిన పారిశుద్ధ్యం

ప్రధానంగా పంచాయతీ కొళాయిలకు సరఫరా అయ్యే పైపులైన్లు, బోరు బావులు పలుచోట్ల మురుగునీటి కాలువలకు సమీపంలో ఉండడం నీటి కలుషితానికి కారణమవుతున్నాయి. అంతే కాకుండా పలుచోట్ల మురుగు నీటి కాలువల్లో కొళాయిలు ఉన్నాయి. ఓవైపు మురుగు ప్రవహిస్తుండగా మరోవైపు అక్కడే ఉన్న కొళాయి నుంచి నీటిని వినియోగించాల్సిన దుస్థితి. దీనికారణంగా ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు మాత్రం ఈ ప్రక్రియను చూసి చూడనట్లు వెళ్లడంపై విమర్శలకు దారితీస్తోంది.


సత్యవేడు : నీటి పరీక్షా ప్రయోగశాల కార్యాలయం


సత్యవేడు నీటి పరీక్షా కేంద్రం ల్యాబ్


వరదయ్యపాళెం : గోవర్ధనపురంలో మురుగు నీటిలో తాగునీటి పైపులైన్

ఆడ పిల్లలను సంరక్షించాలి


మాట్లాడుతున్న సీహెచ్‌ఓ వెంకటేశులు

బుచ్చినాయుడుకండ్రిగ : ఆడ పిల్లలను పుట్టనిద్దాం .. బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. అని మండల ఆరోగ్య అధికారి వెంకటేశులు తెలిపారు. మంగళవారం మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకులంలో సమావేశ మందిరంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తింటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలికలు సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు , సైబర్, ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

కార్మికులకు ఒక నెల వేతనం పంపిణీ


వేతనాలు అందుకున్న షూ పరిశ్రమ కార్మికులు

వరదయ్యపాళెం : మండలంలోని కురింజల్లం గ్రామ సమీపంలోని ఓ ప్రైవేటు షూ పరిశ్రమలో 3 నెలలుగా వేతనాలు అందలేదని కార్మికులు ఇటీవల ఆందోళన చేపట్టారు. దీనిపై నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు మండల తహసీల్దార్ సు . దీర్‌రెడ్డికి ఫిర్యాదు చేసి పరిశ్రమ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం ఒక నెల వేతనాన్ని కార్మికులకు అందజేశారు. మిగిలిన రెండు నెలల వేతనాన్ని త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు పరిశ్రమ యాజమాన్యం పేర్కొన్నట్లు వారు వివరించారు. కార్మికుల వేతన సమస్యలపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు స్పందించడంపై కార్మికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యకు పరిష్కారం చూపిన వారిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా కో–ఆర్డినేటర్ బీజే కిషోర్‌కుమార్, సత్యవేడు నియోజకవర్గ చైర్మన్ డాక్టర్ సురేష్ కుమార్, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సుధీర్ బాబు, మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మోహన్‌కృష్ణ, సభ్యులు గవాస్కర్, జయచంద్ర తదితరులు ఉన్నారు.

సిబ్బంది లేక ఇబ్బందులు

సత్యవేడు : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సింగిల్ విండో) కార్యాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పరపతి సహకార శాఖ అధికారులు నిధులు కేటాయించకపోవడంతో మండలంలో రైతులకు రుణాలు అందిన దాఖలాలు లేవు. సింగిల్ విండో సీఈఓగా పనిచేసిన అధికారి 2014లో బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి పోస్టులు భర్తీ కాలేదు. కార్యాలయంలో పనిచేసిన సూపర్‌వైజరే క్లర్కుగా పనిచేస్తు 2017లో ఉద్యోగ విరమణ పొందారు. అటెండర్ కూడా 2024లో రిటైర్డ్ అయ్యారు. దీంతో సిబ్బంది లేక కార్యాలయం మూత వేసే పరిస్థితి నెలకొంది. రెండేళ్లుగా నిధులు లేక రైతులకు కొత్త రుణాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కొత్తగా వచ్చిన అధ్యక్షులు సిబ్బంది నియామకం, నిధులు మంజూరు చేసి రైతులకు సహకారం అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం


కరపత్రాలను అందజేస్తున్న తలపా దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి : జాతీయ ఎన్నికల సంఘం తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాంపల్లిలో మంగళవారం ఓట్ చోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలే ఓట్ల అవకతవకలకు పాల్పడుతుంటే దేశంలో ప్రజాస్వామ్యం అభాసుపాలవుతుందని , ప్రజల్లో చైతన్యం నింపేందుకు కాంగ్రెస్ పార్టీ ఓట్ చోర్ గద్దిచోడ్ కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షుడు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షుడు నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శైలజ

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రాష్ట్ర శాంపుల్ సర్వే యూనిట్ అధికారులు ఆరోగ్య సిబ్బందికి లెప్రసీ (కుష్ఠు) వ్యాధిపై అవగాహన కల్పించారు. జిల్లా లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. గ్రామాల్లో లెప్రసీ లక్షణాలున్న వారిని గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా లెప్రసీని సమూలంగా నివారించవచ్చన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చెవులు, వీపుపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కు దిబ్బడ, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరి చేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం వంటి అనుమానిత లక్షణాలున్న వారు బుధవారం ఆయా సచివాలయాల్లో ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ శాంపుల్ యూనిట్ సీనియర్ వైద్యాధికారి ఉషారాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వెంకటరమణ, జయ రామకృష్ణారావు, శ్రీనివాసరావు, ముని సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

సులువుగా బోధించాలి


ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ రవి కోరారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఏఓ త్రివిక్రమ రావుతో కలిసి ఎంఈఓ 23 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులకు నీటి వసతితో పాటు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ– 2 ఉషా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

16న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, లక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ గురువారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో టెక్ మహేంద్ర, పైసా బజార్, కాల్మన్, బీపీవో కన్వర్జెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువత అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు తమ వెంట ఆధార్ జిరాక్స్, అకడమిక్ సర్టిఫికెట్స్, రెజ్యూమ్ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9703683455, 6300471661, 9494801211 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చదివిన బడికే టీచర్‌గా..


కొప్పుల ప్రభుకుమార్

శ్రీకాళహస్తి : తాను చదివిన పాఠశాలకే గురువుగా మళ్లీ ఆ బడిలోనే అడుగు పెట్టడం కొందరికే సాధ్యమవుతుంది. ఈ కోవలోనే కొప్పుల ప్రభుకుమార్ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై భాస్కరపేట పాఠశాలకు టీచర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తాను విద్యనభ్యసించిన భాస్కరపేట పాఠశాలలో తనే ఉపాధ్యాయుడుగా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కృషి, పట్టుదలతోనే ఉత్తమ ర్యాంకు సాధించానని తనకు వచ్చిన ఈ అవకాశం ద్వారా విద్యార్థులను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

అసెస్‌మెంట్ పరీక్షల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రారంభమైన రెండవ సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రమణ్యం పరిశీలించారు. మంగళవారం ఆయన మొక్కలచేన్, కల్లివెట్టు, నెలవాయి ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నుంచి కొత్తగా ప్రభుత్వం అందించిన మూల్యాంకనం పుస్తకాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని పరీక్షలు ఒకే పుస్తకంలో విద్యార్థులు రాసేలా అందరి విద్యార్థులకు సబ్జెక్టులకు మూల్యాంకన పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు యువశ్రీమురళి, లక్ష్మయ్య, మాధవీలత, సుజన, నాదెండ్లమురళి, జగన్నాథం పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి




బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కొత్తపాళెంలో మంగళవారం పిడుగు పడడంతో నాదమునిరెడ్డికి చెందిన గేదె మృతి చెందింది. పొలంలో మేత మేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడి పిడుగు గేదెపై పడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 50 వేలు విలువ చేసే పాడి గేదె మృతి చెందడంతో నాదమునిరెడ్డి లబోదిబోమని విలపించారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

రేణిగుంట : ఆరోగ్య నియమాలపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు బాలికల సాధికారత, లింగ వివక్ష, లింగ నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య నియమాలు, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు మోహన్, ఏఎన్ఎంలు రేవతి, విజయలక్ష్మి, రాఘవేంద్ర, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు.. ముంచేస్తోంది!



వరదయ్యపాళెం : ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి చిన్న పాండూరు సమీపంలోని ఏపీఐఐసీ సెజ్ పరిధిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేసే కార్మికుడు. ఆయన అపోలో పరిశ్రమకు వెళ్లే రోడ్డు మార్గానికి పక్కనే మంగళవారం సాయంత్రం మద్యం తాగి తులి తూగుతున్నాడు. ఒళ్లు తెలియని మైకంలో రోడ్డు పక్కనే చెట్ల పొదల మధ్యలో పడి మత్తులో ఉన్నాడు. ప్రధానంగా అపోలో పరిశ్రమకు వెళ్లే మార్గంలోనే మద్యం దుకాణం ఉండడం పలువురు మత్తుకు బానిసవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

గుంతల పెళ్లూరు



బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని గాజుల పెళ్లూరు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉంది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డు నుంచి గాజుల పెళ్లూరు గ్రామానికి కిలోమీటరు పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించిన తారురోడ్డు ఉంది. ఈ రోడ్డు గతేడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని, గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, కార్ల వాహనదారుల బాధలు వర్ణనాతీతం. తారురోడ్డు వేసి 15 ఏళ్లు కావస్తున్న రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో దారుణంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ